ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
ఆదివారం, 9 జూన్ 2024
5



వర్షాకాలం వస్తోందంటే చాలు.. ఖమ్మం నగర వాసులను మున్నేరు నది వణికిస్తుంది. మున్నేరు ఉప్పొంగినప్పుడు వరద సృష్టించే బీభత్సం అంతా ఇంతా కాదు. ప్రతీ ఏటా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కనీసం మూడు లక్షల క్యూసెక్కుల వరద నీరు పోటెత్తుతుంది. మున్నేటి వరద నుంచి ఖమ్మం నగరవాసులకు రక్షణ కల్పించేందుకు మున్నేరు నదికి ఇరువైపులా పోలేపల్లి నుంచి ప్రకాష్‌నగర్ వరకు 8.50 కిలోమీటర్ల మేర కరకట్ట (కాంక్రీట్ గోడలను) నిర్మిస్తున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో కరకట్ట పనులను వేగంగా పూర్తి చేసేందుకు నీటి పారుదలశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.690 కోట్లతో ఈ పనులను చేపట్టింది. గత రెండు నెలలుగా పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ పనులను సీఐవీఈటీ, పటేల్ ఇంజనీరింగ్ అనే రెండు సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. రాబోయే రెండేళ్లలో కరకట్ట పనులు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు.


మున్నేరు వరద దృశ్యం (ఫైల్)

కొనసాగుతున్న కరకట్ట నిర్మాణ పనులు

వరదకు అడ్డుకట్ట

ఖమ్మం నగర శివార్లలో ముమ్మరంగా మున్నేరు కరకట్ట పనులు

- రూ.690 కోట్లతో కొనసాగుతున్న నిర్మాణ పనులు
- బహుళ ప్రయోజనాలతో నిర్మాణం
- పర్యాటకంగా అభివృద్ధికి యోచన
- మంత్రి తుమ్మల ఆదేశాలతో నీటిపారుదలశాఖ అధికారుల కసరత్తు
- రెండేళ్లలో పూర్తిస్థాయి రూపం సంతరించుకోనున్న పనులు

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 8: ఖమ్మం నగర సమీపంలో మున్నేరు నదికి ఇరువైపులా పోలేపల్లి నుంచి ప్రకాష్‌నగర్ వరకు 8.50 కిలోమీటర్ల మేర కరకట్ట (గోడలను) నిర్మిస్తున్నారు. దీనికి నీటిపారుదల శాఖ అధికారులు రూ.690కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు. ఇందులో రూ.190కోట్లు ట్యాక్సుల రూపేణా ఖర్చవుతుండగా రూ.501.30కోట్లతో పనులు నిర్వహించనున్నారు. మున్నేరు నది మధ్యభాగం నుంచి రెండు వైపులా సుమారు 700 అడుగుల వెడల్పుతో గోడలను నిర్మిస్తున్నారు. అక్కడక్కడా భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా 900 అడుగులు కూడా పెంచుతున్నారు. భవిష్యత్తులో మున్నేటికి ఎంత మేర వరద ప్రవాహం వస్తుందని ముందస్తు అంచనాలు కట్టి గోడలను 33 అడుగుల ఎత్తున నిర్మిస్తున్నారు. గోడకు అడుగు భాగాన 33 అడుగుల వెడల్పుతో పైకి వచ్చేసరికి 2.50అడుగులు వెడల్పు ఉండేలా గోడల నిర్మాణాలను డిజైన్ చేసింది. నీటిపారుదల శాఖ అధికారులు రూపొందించిన అంచనాలతో సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ రక్షణ గోడల నిర్మాణాలకు రూపాన్నిచ్చింది. అయితే గోడచివరి భాగంలో కనీసం 5నుంచి 6అడుగుల వెడల్పు ఉండాలని తద్వారా భవిష్యత్తులో ఈ గోడ ఎత్తును పెంచుకునే విధంగా డిజైన్ చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించినట్లు తెలిసింది. అయితే దీనికి అంచనాలు పెరిగే ఆస్కారం ఉన్నట్లు తెలుస్తోంది. మున్నేరు వరదనీటి సంరక్షణ కోసం బహుళ ప్రయోజనం చేకూరేలా రక్షణ గోడల నిర్మాణాలను చేపడుతున్నారు. వాస్తవానికి మున్నేరుకు ప్రతి ఏటా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కనీసం మూడు లక్షల క్యూసెక్కుల వరదనీళ్లు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయి. భవిష్యత్తులో 5 లక్షల క్యూసెక్కులు వరద వచ్చినా తట్టుకునేలా.. ఆ నీటిని సంరక్షించుకునేలా నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనల మేరకు గోడల మధ్య వీలైనన్ని చెక్‌డ్యాంలను నిర్మించాలని సూచించినట్లు తెలిసింది. గోడల నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రస్తుతం దానవాయిగూడెం వద్ద ఉన్న చెక్‌డ్యాం ఎత్తును పెంచాలని ఆ తర్వాత కింది భాగాన కాల్వొడ్డు సమీపంలో ఒకటి, రంగనాయకుల గుట్ట సమీపంలో మరొక చెక్‌డ్యాంను నిర్మిస్తే వరద నీటిని ఇక్కడే రిజర్వ్ చేసుకునే ఆస్కారం ఉంటుందని పేర్కొంటున్నారు. దీనికోసం మున్నేరుకు ఇరు పక్కల ప్రభుత్వ స్థలాల వద్ద గోడల నిర్మాణాన్ని

(మిగతా 6వ పేజీలో)

భూ సేకరణకు నిధులు..

వాస్తవానికి మున్నేరుకు రెండు వైపులా ప్రైవేటు స్థలాలు ఉన్నాయి. దీనికి అవసరమైన భూసేకరణకు కూడా ప్రభుత్వం నిధులు కేటాయించింది. అయితే గోడల నిర్మాణంతోపాటు ఖమ్మంనగరం నుంచి వచ్చే మురుగునీటిని మున్నేరులో కలపకుండా గోడలకు ఇరువైపులా కనీసం 10 అడుగల వెడల్పుతో రోడ్డు నిర్మాణాన్ని కూడా చేపట్టాలని యోచిస్తున్నారు. దీనికి అనుసంధానంగా డ్రెయిన్ నిర్మాణాన్ని కూడా చేపడితే నగరం నుంచి వచ్చే వరద నీటిని ఈ డ్రెయిన్ల ద్వారా గోడల చివరివరకు తీసుకెళ్లి అక్కడ కలిపే విధంగా డిజైన్ చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించినట్లు తెలిసింది. అంతే ప్రకాష్‌నగర్ నుంచి ప్రజలు ఈ గోడల పక్కన నిర్మించే రోడ్డును వినియోగించుకుని నగరంలోకి రాకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లే విధంగా ప్రయోజనకరంగా దీన్ని నిర్మించాలని సూచించినట్లు తెలిసింది. దీనితో పాటు ఎన్నెస్పీ కాలువ మున్నేరు అక్విడెక్ట్ వద్ద గోడలకు స్లూయిస్ (తూములను) ఏర్పాటు చేస్తున్నారు. వరద సమయాల్లో షట్టర్లను మూసి వేసి మామూలు సమయాల్లో తెరిచి ఉంచితే వరద నీరు, మురుగు నీరు కాలువలకు పారే విధంగా డిజైన్ చేశారు.


నిర్విరామ గాన కార్యక్రమంలో పాల్గొన్న మాలతీ నాయుడు, ఇతర గాయకులు

32 గంటల నిర్విరామ గానం షురూ

- పలు హిట్ పాటలను ఆలపించిన గాయకులు
- హాజరైన వివిధ 'రికార్డ్స్' సంస్థల ప్రతినిధులు
- నేడు ముగియనున్న కార్యక్రమం

వివరాలు : 7లో




రోడ్డు ప్రమాదం కేసులో బాధితులకు నష్టపరిహారం మంజూరు పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

లోక్‌అదాలత్ ద్వారా మానసిక ప్రశాంతత

- జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్
- 7 బెంచ్‌ల ద్వారా 11,298 కేసులకు పరిష్కారం

వివరాలు : 6లో



వివరాలు : 6లో

- ఐదు దశాబ్దాలుగా భాషా సేవలో తరిస్తున్న ఎస్జీజీ శ్రీమన్నారాయణాచార్యులు
- వేలాదిమందికి విద్యాబోధన
- శిష్యలోకంలో 'సంస్కృతం గురువు గారు'గా ప్రసిద్ధి
- భద్రాచలం రామాలయ పండితులుగా తనదైన పాత్ర
- అనేక ఉత్సవాల్లో వ్యాఖ్యాతగా గుర్తింపు
- ఇప్పటికీ తరగని ఉత్సాహంతో బోధన

సంస్కృతమే ఆయన సర్వస్వం

జల పుష్పాల జాతర

మృగశిర వేళ కిక్కిరిసిన చేపల మార్కెట్లు



ఖమ్మం సాంస్కృతికం, జూన్ 8: మృగశిర కార్తె సందర్భంగా నగరంలో చేపల జాతర కొనసాగింది. మార్కెట్లతోపాటు రోడ్ల వెంట ఎక్కడ చూసినా చేపల విక్రయాలు పెద్ద ఎత్తున కొనసాగాయి.. మృగశిర నాడు చేపలను కూర వండుకొని తింటే శ్వాస కోశ సంబంధిత వ్యాధులు తగ్గుతాయన్న నమ్మకం ఉండటంతో మాంసాహారులు చేపల కొనుగోలుకు ఆసక్తి చూపారు. అవసరమైన చేపల కోసం వినియోగదారులు చేపల చెరువుల వద్దకు, మార్కెట్లకు ఎగబడ్డారు. కార్తె ప్రారంభం సందర్భంగా వినియోగదారుల రద్దీని దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు ఆంధ్రా ప్రాంతంలోని కృష్ణా, గుంటూరు, తదితర జిల్లాలనుంచి హోల్ సేల్ వ్యాపారులు పెద్ద ఎత్తున చేపలను దిగుమతి చేశారు. రవ్వ, బొచ్చె, బంగారు తీగ, తదితర తెల్ల చేపలను అధికంగా కొనుగోలు చేశారు. డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని చేపల అమ్మకందార్లు బొచ్చా, రవ్వ చేపలను కిలో రూ.160నుంచి రూ.200కు, కొర్రమీను చేపలు కిలో రూ.300నుంచి రూ.400కు విక్రయించారు.చేపల క్రయ విక్రయాలతోపాటు ఆకాశం మేఘావృతమై వర్షం సైతం కురవటంతో మృగశిర కార్తె వాతావరణం ఏర్పడింది.

నేడు గ్రూప్-1 ప్రిలిమ్స్

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లాలో 52 కేంద్రాలు... 18,403 అభ్యర్థులు...
- జ్యూయలరీ, షూస్ అనుమతించేది లేదు
- అభ్యర్థులు గుర్తింపు కార్డు తెచ్చుకోవాల్సిందే



ఖమ్మం కలెక్టరేట్, జూన్ 8: గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు హాజరయ్యే యువతులు జ్యూయలరీ(ఆభరణాలు), ఎవరూ షూస్‌తో రాకూడదనే నిబంధనను కచ్చితంగా అమలు చేస్తున్నారు. ఎలక్ట్రానిక్ వాచీలు, ఇతర గాడ్జెట్లు అనుమతిలేదు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదివారం నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు పరీక్ష నిర్వహించనున్నారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచి 10 వరకు పరీక్షా కేంద్రంలోనికి అనుమతిస్తారు. 10 గంటలకు పరీక్షా కేంద్రం గేట్లు మూసివేస్తారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఉండదు. ఈ పరీక్షకు మొత్తం 18,403మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. అయితే పరీక్షరాసే వారు తమ వెంట ఒరిజినల్ హాల్ టికెట్‌తోపాటు గుర్తింపు కార్డు తీసుకొని రావాల్సి ఉంటుంది. అధికారులు ఈసారి పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థుల బయోమెట్రిక్ నిర్వహించనున్నారు. అభ్యర్థులు బయోమెట్రిక్ వేయకుండా పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. అభ్యర్థులు చేతి వేళ్లపై ఎలాంటి మెహంది, టాటూలు లేకుండా చూసుకోవాలి. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లే ముందు తమ హాల్ టికెట్‌పై పాస్ పోర్ట్ సైజ్ ఫొటోను తప్పనిసరిగా అతికించాల్సి ఉంటుంది. ఈ ఫొటో 3 నెలల లోపు దిగినదై ఉండాలి. హాల్ టికెట్‌ను ఆన్‌లైన్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లే సమయంలో క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపనున్నారు.


విద్యానగర్‌కాలనీలో ప్రధాన రహదారిపై వరద నీరు

కొత్తగూడెంలో భారీ వర్షం

విద్యానగర్ కాలనీలో ప్రధాన రహదారి జలమయం

చుంచుపల్లి, జూన్ 8: జిల్లా కేంద్రమైన కొత్తగూడెం, చుంచుపల్లి ప్రాంతాల్లో శనివారం కురిసిన అకాల వర్షానికి ప్రధాన రహదారులు పూర్తిగా జలమయమయ్యాయి. ముఖ్యంగా చుంచుపల్లి మండలంలోని విద్యానగర్‌కాలనీ రహదారిపై వరద నీరు భారీగా చేరి చెరువును తలపించింది. ఈ రోడ్డుపైనే వాహనదారులు ప్రయాణిస్తు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. దీంతో ఖమ్మం - కొత్తగూడెం రహదారిపై రాకపోకలకు తీవ్ర ఇబ్బంది నెలకొంది.

ఎంత ప్రమాదమో...



వైరా హైలెవల్ వంతెనను అలుముకుంటున్న డంపింగ్ యార్డు పొగ

వైరా, జూన్ 8: జాతీయ ప్రధాన రహదారిలో వైరా నదిపై ఉన్న హైలెవల్ వంతెనను మునిసిపాలిటీకి చెందిన డంపింగ్ చెత్త నుంచి వెలువడే పొగ కమ్మేస్తోంది. దాంతో వాహనచోదకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వైరా మునిసిపాలిటీలో సేకరించిన చెత్తాచెదారాన్ని వైరా నదిలో హైలెవల్ వంతెన కింద డంప్ చేస్తున్నారు. డంప్ చేసిన చెత్తకు నిప్పుపెట్టి కాల్చివేస్తున్నారు. ఆ మంటల నుంచి వెలువడిన దట్టమైన పొగ హైలెవల్ వంతెనను కమ్మేసి వాహనచోదకులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అసలే ఈ వంతెన మొత్తం గుంతలతో నిండి ఉంది. దానికితోడు డంపింగ్ చెత్తనుంచి వెలువడుతున్న పొగ వంతెనను పూర్తిగా కమ్మేసి ఏమాత్రం వాహనచోదకులకు దారి కన్పించని పరిస్థితి నెలకొంది. వంతెనపై రాకపోకలు కొనసాగించే వారు పొగతో ఉక్కిరిబిక్కిరి కావడమే కాకుండా ఎదురెదురుగా వచ్చే వాహనాలు కన్పించక ప్రమాదాల బారినపడుతున్నారు. నిత్యం 50వేలకుపైగా వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. అంతేకాకుండా స్థానికంగా ఉండే వేలాదిమంది ప్రజలు ద్విచక్ర, త్రిచక్ర వాహనాలతో వైరా, ఖమ్మం, భద్రాచలం, సత్తుపల్లి, తిరువూరు ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు చేస్తుంటారు. వీరంతా దట్టంగా అలుముకుంటున్న పొగలోనుంచే ప్రమాదకర రీతిలో రాకపోకలు కొనసాగించాల్సి వస్తోంది. ఇంత జరుగుతున్నా.. జాతీయ హైవే అధికారులు కానీ, మునిసిపాలిటీ అధికారులు కానీ తమకేమీ పట్టనట్టు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏదైనా ఘోరమైన ప్రమాదం జరిగితే ఈ రెండుశాఖల అధికారులను బాధ్యులను చేసి కఠినంగా శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ నిర్లక్ష్యాన్ని వీడి డంపింగ్ యార్డును మార్చాలని ప్రజలు కోరుతున్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, కోచ్ గౌస్

రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీల్లో
నగర క్రీడాకారుల ప్రతిభ

ఖమ్మం స్పోర్ట్స్, జూన్ 8: ఈనెల 6, 7 తేదీల్లో వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో నగరానికి చెందిన క్రీడాకారులు సత్తా చాటి పతకాలు సాధించారు. సర్దార్ పటేల్ స్టేడియంలో నిత్యం సాధన చేసే క్రీడాకారులు 10 స్వర్ణ, 6 రజత, 5 కాంస్య పతకాలతో సహా మొత్తం 21పతకాలు కైవసం చేసుకున్నారు. భవిత 300, లాంగ్‌జంప్‌లో స్వర్ణ పతకాలు సాధించగా, లోహిత 80 మీటర్ల పరుగు పోటీలో స్వర్ణ, 300 మీటర్ల పరుగు పోటీలో రజత పతకాలు సాధించింది. అంతే కాకుండా మనుశ్రీ 100మీటర్ల పరుగు పోటీలో స్వర్ణ, నవ్యశ్రీ షాట్‌పుట్‌లో కాంస్య, బిందు 200 మీటర్ల పరుగు పోటీలో కాంస్య, మస్తాన్ 100మీటర్ల పరుగు పోటీలో స్వర్ణం, అశోక్ 400 మీటర్ల పరుగు పోటీలో రజత, గౌతమ్ 100, 200 మీటర్ల పరుగు పోటీలో రెండు స్వర్ణాలు, ఆఫ్తాబ్ షాట్‌పుట్‌లో కాంస్యం, హ్యామర్‌త్రోలో రజతం, గోపీచంద్ 5 కిలో మీటర్ల వాక్ పోటీలో స్వర్ణం, మనీషా 100మీటర్ల పరుగు పోటీలో కాంస్య, సింధుప్రియ 100మీటర్ల పరుగు పోటీలో రజతం, మైథిలి 100మీటర్ల పరుగు పోటీలో స్వర్ణం, 200 మీటర్ల పరుగు పోటీలో రజతం, హజీరా ఫాతిమా షాట్‌పుట్‌లో స్వర్ణం, వేణు డిస్కస్‌త్రోలో కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ గౌస్, అథ్లెటిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, కార్యదర్శి షఫీక్ అహ్మద్‌లు అభినందించారు. భవిష్యత్ పోటీల్లో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఈసారి మాకూ బదిలీలుంటాయట..

» భద్రాద్రి దేవస్థానం ఉద్యోగుల్లో అంతర్గత చర్చ » వచ్చేవారంలో స్పష్టత వచ్చే అవకాశం

భద్రాచలం, జూన్ 8: దేవాదాయ శాఖలో సుమారు దశాబ్దంన్నర కాలంగా బదిలీ ప్రక్రియ నిలిచిపోవడంతో రాష్ట్రంలోని ప్రధాన దేవస్థానాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఎక్కడివారు అక్కడే ఏళ్ల తరబడి ఒకేస్థానంలో పని చేస్తున్నారు. ఈ క్రమంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయశాఖలో బదిలీల ప్రక్రియకు ఈనెల రెండో వారం నుంచి శ్రీకారం చుట్టనుందని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో భద్రాద్రి దేవస్థానంలో బాధ్యతలు నిర్వహించే రెగ్యులర్ ఉద్యోగులు ఈసారి తమకు బదిలీలు తప్పకపోవచ్చని భావిస్తున్నారు. దీర్ఘకాలంగా ఇక్కడే బాధ్యతలు నిర్వహిస్తుండటంతో ఈసారి భారీగానే బదిలీలుంటాయని దేవస్థానం వర్గాల్లో అంతర్గత చర్చ జరుగుతోంది. అన్ని విభాగాల్లో వివిధ హోదాల్లో ఉన్న ఉద్యోగుల బదిలీలు ఈ నెలలో జరిగే అవకాశలున్నట్లు భావిస్తున్నారు. వాస్తవానికి ఇందుకు సంబంధించిన ప్రక్రియకు ఎప్పుడో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సిద్ధమైనా ఎన్నికల కోడ్ కారణంగా నిర్ణయం వాయిదా పడినట్టు తెలిసింది.

ఇక్కడే పోస్టింగ్.. విరమణ

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో పనిచేసే ఉద్యోగుల్లో దాదాపు అందరూ ఇక్కడే తమ ఉద్యోగ బాధ్యతలు చేపట్టి ఇక్కడే ఉద్యోగ విరమణ చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. గత దశాబ్దాల కాలంగా భద్రాద్రి దేవస్థానంలో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. దేవస్థానంలో పరిపాలనపరంగా 39 మంది ఉద్యోగులుండగా వారిలో అధికశాతం మంది ఏళ్ల తరబడి ఇక్కడే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే తాజాగా ఎన్నికల కోడ్ ముగియడంతో దేవాదాయ శాఖ చేపట్టే బదిలీల ప్రక్రియలో రాష్ట్రంలోని ఇతర ప్రధాన దేవస్థానాలతోపాటు భద్రాద్రి దేవస్థానంలో సైతం బదిలీల ప్రక్రియ నిర్వహించనున్నట్లు సమాచారం.

ఆరోపణలు.. అవినీతి మరకలు

భద్రాద్రి దేవస్థానంలో పని చేసే ఉద్యోగుల్లో పలువురిపై అవినీతి, అవకతవకలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గత దశాబ్దకాలంగా ఇక్కడ పని చేస్తున్న ఉద్యోగుల్లో పలువురు వ్యవహరించిన తీరు దేవస్థానానికి మాయనిమచ్చలా నిలిచిందనే విమర్శలు సైతం ఉన్నాయి. రెగ్యులర్ ఉద్యోగుల్లో కొందరితోపాటు కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో పలువురికి అంతర్గతంగా ఉన్న సంబంధాలతో గత కొంతకాలంగా దేవస్థానం ఆదాయానికి గండికొట్టారనే ఆరోపణలున్నాయి. గత దశాబ్దకాలంలో జరిగిన వివిధ అవినీతి, అవకతవకల గురించి గతేడాది నుంచి ఎన్నో వెలుగులోకి వస్తున్న సందర్భాలున్నాయి. ఇప్పటికే అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలతో దేవస్థానంలో పనిచేసే ఓ కీలక అధికారిని సస్పెండ్ చేశారు. అలాగే వివిధ విభాగాల్లో పలువురు ఉద్యోగులు అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురయ్యారు. దేవస్థానం క్యాడర్ స్ట్రెన్త్‌లో లేని పోస్టుకు ఐదేళ్లపాటు ఓ ఉద్యోగికి జీతం చెల్లిస్తున్నారంటే గతంలో అధికారుల తీరు ఏ విధంగా ఉందో అవగతమవుతోంది. ఇటీవల ఆడిట్ అధికారుల పరిశీలనలో ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాగా దేవస్థానంలో వెండి, తదితర ఆభరణాలకు సంబంధించిన లెక్కలపై సైతం అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై ఇటీవల రాష్ట్ర దేవాదాయశాఖకు చెందిన ఓ కీలక అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక సిద్ధం చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇందుకు సంబంధించి ఆ నివేదిక ద్వారానే వాస్తవ విషయాలు తెలుస్తాయని దేవస్థానం వర్గాల్లో చర్చ జరుగుతోంది.

రామోజీరావు మృతిపట్ల
పలువురి సంతాపం

ఖమ్మం, జూన్ 8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఈనాడు గ్రూప్ అధినేత చెరుకూరి రామోజీరావు మృతిపట్ల ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు మంత్రులు, ఎంపీలు, ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.



క్రమశిక్షణ, పట్టుదలతో రాణించారు
వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

క్రమశిక్షణ, పట్టుదలతో రామోజీరావు ఈనాడు గ్రూప్ సంస్థల్లో రాణించారు. ఈనాడు పత్రికతో ప్రజాచైతన్యానికి బాటలు వేసిన అక్షరయోధుడు రామోజీరావు.. రైతులకు ఆధునిక పద్ధతులు తెలిసేలా అన్నదాత పత్రిక తీసుకొచ్చారు. ఈనాడు, ఈటీవీ ద్వారా సమాజాన్ని చైతన్యం చేశారు. వ్యాపార రంగంలో ప్రత్యేక ముద్ర వేయడంతో పాటు దేశానికి, సమాజానికి ఎంతో చైతన్యం కలిపించిన ఆయన మరణం తీవ్ర బాధాకరం..



పత్రికారంగంలో తనదైన ముద్ర
రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తెలుగుపత్రికా రంగంలో తనదైన ముద్ర వేసుకున్న గొప్ప వ్యక్తి చెరుకూరి రామోజీరావు. జర్నలిజంలో ఆయన దేశానికి, సమాజానికి ఆదర్శంగా నిలిచారు. ఏ రంగంలోనైనా మనసు పెట్టి క్రమశిక్షణతో పని చేస్తే విజయం సాధించవచ్చనడానికి రామోజీరావు ఉదాహరణ. తన వ్యాపారాలతో ఎంతోమందికి ఉపాధి చూపించగలిగారు. పత్రిక, ఛానల్ ద్వారా సమాజాన్ని చైతన్యం చేశారు.




రామోజీరావు మృతి తీరనిలోటు
రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి

రామోజీరావు మృతి సమాజానికి తీరని లోటు. ఆయన అకాలమరణం బాధాకరం.. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి..



పత్రికారంగానికి రామోజీరావు ఆదర్శం
రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

తెలుగు పత్రికా రంగానికి రామోజీరావు ఆదర్శవంతుడు. ఈనాడు గ్రూప్ సంస్థలతో వ్యాపార రంగంలో ఆయన నూతన వరవడితో ముందుకు సాగారు. క్రమశిక్షణ, పట్టుదల, కార్యదీక్షకు ఆయనకు నిలువెత్తు నిదర్శనం.



మీడియా రంగానికి తీరనిలోటు
మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు

రామోజీరావు మృతి మీడియా రంగానికి తీరని లోటు.. విలువలతో కూడిన వ్యవస్థలను నడిపారు. ప్రపంచానికే ఆయన విధానాలు ఆదర్శనీయం. సామాజిక సమస్యల పరిష్కారానికి ఎన్నో ఉద్యమాలను ప్రోత్సహించారు.



రామోజీరావు స్ఫూర్తి ప్రదాత
టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు

మీడియాతో పాటు వ్యాపార రంగంలో క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసిన రామోజీరావు ఎందరికో స్ఫూర్తి ప్రదాత.. తన సంస్థల ద్వారా ఎంతోమందికి చేయూతనిచ్చారు. ఎన్నో అవకాశాలను కల్పించి ఉపాధి చూపించారు. ఆయన మృతి బాధాకరం.

రామోజీరావు మృతికి తానా మాజీ అధ్యక్షుడు జయశేఖర్ సంతాపం

ఈనాడు, ఈటీవీ సంస్థల అధిపతి రామోజీరావు మృతిపట్ల ఉత్తర అమెరికా తెలుగుసంఘం (తానా) మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్ సంతాపం తెలిపారు. గ్రామీణ నేపథ్యంతో రైతుకుటుంబం నుంచి వచ్చి పత్రికారంగంలో మహారాజుగా వెలిగారన్నారు. ఆయన పట్టుదల, స్వయంకృషి, నిజాయితీ సమాజానికి ఆదర్శమని తెలిపారు. రామోజీరావు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వరదకు అడ్డుకట్ట

(5వ పేజీ తరువాయి)


ముమ్మరంగా సాగుతున్న పనులు

900 అడుగుల వరకు వెడల్పు చేస్తే నీటిని రిజర్వ్ చేసుకు నేందుకు ఆస్కారం ఉంటుందని మంత్రి తుమ్మల సూచించిన విధంగా నీటిపారుదల శాఖ అధికారులు పనులను చేపట్టారు. అంతే కాదు భవిష్యత్తులో ఇక్కడ పర్యాటకా ప్రాంతంగా అభివృద్ధి పరచాలని యోచిస్తున్నారు. ఇక్కడ ప్లాట్ ఫారాలు ఏర్పాటు చేసి రిజర్వాయర్‌లా అభివృద్ధి చేసి బోటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం మున్నేరుపై తీగత వంతెన నిర్మాణం పూర్తయిన తర్వాత పాత వంతెనను కేవలం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేలా అంచనాలు సిద్ధం చేస్తున్నారు.

ముమ్మరంగా పనులు...

ప్రస్తుతం పోలేపల్లి సమీపంలో మున్నేరు నదికి రెండు వైపులా పనులను నీటిపారుదల శాఖ అధికారులు ప్రారంభించారు. 2 కిలోమీటర్ల మేర ఫౌండేషన్ పనులను చేపట్టా రు. 30 మీటర్ల వెడల్పుతో పునాది తవ్వి కాంక్రీట్ పనులను చేపట్టారు. స్కిన్ రెయిన్ ఫోర్స్ కాంక్రీట్ పనులను పూర్తి చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 26న ఈ పనులకు టెండర్లు ఖరారు కాగా రెండేళ్లలో పనులను పూర్తి చేసేందుకు అధికారులు పనులను ముమ్మరం చేస్తున్నారు. నగరం వైపు ఉన్న పనులను ఖమ్మం డివిజన్ ఇంజనీర్లు పర్యవే క్షిస్తుండగా అవలి వైపు ఉన్న పనులను పాలేరు నియోజకవర్గ నీటిపారుదల ఇంజనీరింగ్ అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు. గత రెండు రోజుల క్రితం సీఈ విద్యాసాగర్ లైనింగ్ పనలను, కాంక్రీట్ పనులను పర్యవేక్షించి పలు సూచనలు చేశారు.

పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి
● విద్యాసాగర్, నీటిపారుదలశాఖ చీఫ్ ఇంజనీర్

ఖమ్మం నగరానికి మున్నేరు పరీవాహక ప్రాంతం రెండేళ్లలో మకుటాయమానంగా తయారుకానుంది. రక్షణ గోడలతో పాటు ఖమ్మం నగరంలో తాగునీటి అవసరాలకు అనుగుణంగా చెక్‌డ్యాంలు నిర్మించి రిజర్వాయర్లుగా అభివృద్ధి చేయనున్నాం. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించినట్లు ఈ పనులను బహుళ ప్రయోజనాలు చేకూరేలా చేపట్టనున్నాం. అయితే ప్రస్తుతం రూ501.30 కోట్లతో గోడలను మాత్రమే నిర్మిస్తున్నాం. అవసరాలకు అనుగుణంగా పనులను చేపట్టి నగర ప్రజలకు మున్నేరు ఒక ఆహ్లాదకరమైన ప్రాంతంగా అభివృద్ధి చేయనున్నాం.

ఆసరా కల్పించరూ..

» ఆరేళ్లుగా పింఛన్ కోసం ఎదురుచూపులు ...


గుర్వమ్మ

ఇల్లెందురూరల్, జూన్8: అర్హులైన వృద్ధులకు, వితంతు మహిళలకు, దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న ఆసారా పెన్షన్లు నేటికి అనేక మంది అర్హులైన వారికి ధరిచేరడం లేదు. 57 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ప్రభుత్వం పెన్షన్‌లు మంజూరు చేస్తుంది. కాని అందుకు విరుద్ధంగా ఇల్లెందు మండలం నిజాంపేట గ్రామానికి చెందిన 70ఏండ్ల వృద్ధురాలైన వర్స గురువమ్మకు పెన్షన్ మంజూరు కాలేదు. గతంలో ఆమె భర్త వర్స భీమయ్యకు వృద్ధాప్య పెన్షన్ వస్తుండేది. ఏడేళ్ల క్రితం అనారోగ్యంతో అతడు మృతి చెందాడు. భర్త చనిపోయిన వితంతు పెన్షన్ కోసం దరఖాస్తు చేసింది. అయినప్పటికీ నేటి వరకు వితంతు పెన్షన్ కాని, వృద్ధాప్య పెన్షన్ కాని అధికారులు మంజూరు చేయలేదు. ఒక సందర్భంలో గ్రామ పర్యటనకు వచ్చిన అప్పటి కలెక్టర్ దురిశెట్టి అనుదీప్‌కు తనకు పెన్షన్ మంజూరు చేయలని ఆమె వేడుకుంది. వెంటనే స్పందించిన కలెక్టర్ స్థానిక అధికారులను ఆదేశించిన నేటి వరకు అతిగతిలేదు. ఒంటరిగా ఉంటనున్న ఆ అవ్వకు ఇళ్లు గడవడమే కష్టంగా ఉందని, గ్రామస్థులే తాలో చేయి వేసి ఆ అవ్వకు ఆసారాగా ఉంటున్నారు. సరైన ఇల్లు కుడా లేదు ఆ అవ్వకు ఆసరా కల్పించి ఆమె ఆదుకోవాలనా గ్రామస్థులు వేడుకుంటున్నారు.

సంస్కృతమే ఆయన సర్వస్వం



» ఐదు దశాబ్దాలుగా భాషా సేవలో తరిస్తున్న ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులు

భద్రాచలం, జూన్ 8 : సమస్త భాషలకు తల్లి లాంటిది సంస్కృతం. భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు మూలమైనది సంస్కృత భాష. ఎన్నో జ్ఞాన విజ్ఞానాలను అందించిన దైవ భాష సంస్కృతం. అంతటి మహత్తరమైన భాషా సేవలో ఎంతోమంది మహనీయులు తరిస్తున్నారు. భాషా నామంతోనే 'సంస్కృతం గురువుగారు' అని వ్యవహరించబడుతున్నారు భద్రాచలానికి చెందిన ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులు. సంస్కృత భాషా సేవలో తరిస్తున్న శ్రీమన్నారాయణాచార్యులు భద్రాద్రి దేవస్థానంలో ఎందరో వైదిక సిబ్బందికి, ఇతరులకు సంస్కృతంలో బోధన చేశారు. అలాగే ఆయన శిష్యులు కీలక స్థానాల్లో కొనసాగుతున్నారు.

ఐదు దశాబ్దాలుగా...

పండిత వంశంలో జన్మించిన శ్రీమన్నారాయాణాచార్యులు తన తండ్రి వద్ద సంస్కృతాన్ని, శాస్త్రాలను అధ్యయనం చేశారు. అలంకార శాస్త్రం, వ్యాకరణం, మీమాంస, ఆగమ జ్యోతిష్యం తదితర శాస్త్రాల్లో ఆయన మహాప్రావీణ్యం సాధించారు. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం సంస్కృత పండితులుగా అనేకమంది విద్యార్థులకు సంస్కృతాన్ని బోధించారు. వీరి వద్ద అధ్యయనం చేసిన వారిలో యూనివర్సిటీ ప్రొఫెసర్లు, డాక్టరేట్ పొందిన వారు, కళాశాల అధ్యాపకులుగా, పంచాంగకర్తలుగా కొనసాగుతున్నారు. అలాగే విదేశాల్లో సంస్కృతం బోధించే అధ్యాపకులుగా వెలుగొందుతున్నారు. దేవస్థానంలోని అత్యధిక శాతం అర్చకులు, వేద పండితులు కూడా వీరి వద్ద సంస్కృతాన్ని అధ్యయనం చేశారు. ఆన్‌లైన్ ద్వారా కూడా సంస్కృతాన్ని శ్రీమన్నారాయణాచార్యులు బోధిస్తున్నారు.

పరీక్ష ఫీజులు సైతం చెల్లించి..

సంస్కృత భాషపై ఎంతో మక్కువ ఉన్న శ్రీమన్నారాయణాచార్యులు సంస్కృతం నేర్చుకునేందుకు ఆసక్తి కనబరిచే విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. ఎవరైనా విద్యార్థులు ఆర్థికపరమైన ఇబ్బందులతో పరీక్ష ఫీజు కట్టలేకుంటే, వారికి తెలియకుండానే చెల్లించి పరీక్షలు రాసేందుకు తనవంతు సహకారం అందించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. భాషబోధనలో విద్యార్థులకు అవసరమైన గ్రంథాలను సైతం తానే కొనుగోలు చేసి వారికి అందించేవారు. అలా కొన్ని వేల పుస్తకాలను వారు వితరణ చేశారు.

సంస్కృత గురువుగారు..

శ్రీమన్నారాయణాచార్యులు తన అసలు పేరుకు బదులుగా సంస్కృత గురువుగారుగా అందరికి సుపరిచిరుతులు. ఎంతోమంది పండితుల ప్రశంసలను కూడా అందుకున్నారు. సంస్కృత భాష బోధకులుగానే కాకుండా దేవస్థానంలో జరిగే శ్రీరామనవమి, వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు ఆకాశవాణి వ్యాఖ్యాతగా కూడా నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్నారు. దేవస్థానం ఉద్యోగుల్లో తొలి వ్యాఖ్యాత వీరే కావడం విశేషం. గతంలో భద్రాద్రి దేవస్థానానికి కంచిపీఠం గజాన్ని అందించగా దానిని అధిరోహించే అదృష్టం కూడా శ్రీమన్నారాయణాచార్యులకే దక్కింది. 1987లో నిర్వహించిన మహాసామ్రాజ్య పట్టాభిషేకానికి ముహూర్తం నిర్ణయించింది కూడా ఆయనే. శ్రీరామనవమి, వైకుంఠ ఏకాదశి ఆహ్వానపత్రికల్లో ఆలయ ఉత్సవ ప్రాశస్త్యాలను అందించారు. ఆలయంలో జరిగే రామదాసు జయంతి, తూము నరసింహదాసు జయంతిలతోపాటు స్వర్ణలక్ష్మి అమ్మవారి పాల్గొనేత్తర అనే ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని ఆలయంలో నిర్వహించడానికి కృషి చేశారు. ఇటు భాషా సేవ, ఆటు రామచంద్రుని సేవలో ఆయన తరిస్తున్నారు.

అందుకున్న బిరుదులెన్నో...

సంస్కృత పండితులుగా శ్రీమన్నారాయణాచార్యులు అందుకున్న బిరుదులు ఎన్నో ఉన్నాయి. వారి శాస్త్ర పాండిత్యాన్ని మెచ్చుకొని శాస్త్ర రత్నాకర, పండితరాజ, విద్వత్ వరేణ్య తదితర బిరుదులను అందుకున్నారు. అలాగే యునెస్కో వారు సైతం సత్కరించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఇవే కాకుండా ఎన్నో సంస్థలు వారి భాషా సేవను కొనియాడుతూ సముచిత రీతిలో సత్కరించారు. ఇదిలా ఉండగా పరీక్షాధికారిగా దేవాదాయ శాఖకు అలాగే శ్రీ వెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంకు, సంస్కృత భాష ప్రచారణీయ సభ చిత్తూరు తదితర సంస్థలకు వివిధ శాస్త్రాల పరీక్షాధికారిగా కూడా బాధ్యతలు నిర్వహించారు.


2002లో అప్పటి ఈవో మురళీధర్‌రెడ్డి, సంస్కృత విద్యార్థులతో శ్రీమన్నారాయణాచార్యులు

లోక్‌అదాలత్ ద్వారా మానసిక ప్రశాంతత

● జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్

ఖమ్మం లీగల్ జూన్ 8: పెండింగ్ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకుంటే విలువైన సమయం, డబ్బు ఆదా చేసుకోవడంతో పాటు వెలకట్టలేని మానసిక ప్రశాంతతను పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ తెలిపారు. జిల్లాలో శనివారం లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా పరిష్కారంకాని కేసులు లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవటం వల్ల సత్వర న్యాయం జరుగుతందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ లోక్‌అదాలత్ కార్యక్రమం విజయవంతం కావడంలో బార్‌అసోసియేషన్ సహకారం ఉంటుందన్నారు. లోక్ అదాలత్‌లో రాజీపడిన ఇద్దరు దంపతులను, వాహన ప్రమాద కేసులో రాజీపడి రూ.14లక్షల అవార్డు పొందిన పిటీషనర్‌ని జిల్లా న్యాయాధికారి అభినందించి వారికి మొక్కలను బహుకరించారు. కార్యక్రమంలో న్యాయాధికారులు కె.ఉమాదేవి, వి.అపర్ణ, డి.రాంప్రసాదరావు, ఎం.అర్చనాకుమారి, కె.వి.చంద్రశేఖరరావు, కె.దీప, వై.బిందుప్రియ, వి.మాధవి, బి.రజని, జూనియర్ న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 11,298 కేసుల పరిష్కారం

జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 11,289 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ లోక్ అదాలత్ కోసం మొత్తం 7బెంచ్‌లను న్యాయసేవాసంస్థ కార్యదర్శి కె.వి చంద్రశేఖర్‌రావు ఏర్పాటు చేశారు. మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి 67రోడ్డు ప్రమాద నష్టపరిహార కేసులు పరిష్కరించారు. బాధితులకు 1.47 కోట్ల పరిహారం అందించారు. 244విద్యుత్ శౌర్యం కేసులను పరిష్కరించారు. జిల్లా ప్రధాన జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.దీప 76 కేసులను పరిష్కరించారు. మొదటి అదనపు జూనియర్ సవిల్ న్యాయాధికారి బి.రజిత 235 క్రిమినల్ కేసులతోపాటు 71 సైబర్ క్రైమ్ కేసులను పరిష్కరించారు. రెండో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి వై.బింధుప్రియ 1,948 కేసులను పరిష్కరించారు. మూడో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి వి.మాధవి 216 క్రిమినల్ కేసులను పిరష్కరించారు. మొబైల్ కోర్టుకు సంబంధించి 418 కేసులను, ఎక్సైజ్‌కోర్టు 66 కేసులను న్యాయాధికారి బి.రజని పరిష్కరించారు. ఇతర కేసులు 4,738 కేసులను పరిష్కరించారు. రెండో శ్రేణి మెజిస్ట్రేట్ సలీం 1,621 పిట్టి కేసులను పరిష్కరించారు. ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో జాతీయ లోక్‌అదాలత్‌కు వచ్చిన కక్షిదారులకు పులిహోర, తాగునీరు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు మజ్జిగ ప్యాకెట్లు అందించారు. జిల్లాలో సత్తుపల్లిలో 585 కేసులు, మధిరలో 934 కేసులు పరిష్కారమయ్యాయి. న్యాయవాదులు తెల్లాకుల రమేష్‌బాబు, రంగారావు, వి.వాసవికుమారి, మువ్వా నాగేశ్వరరావు, మల్సూరు, వెంకటనారాయణ లోక్ అదాలత్ సభ్యులుగా వ్యవహరించారు.



కక్షిదారులకు మొక్కలను అందజేస్తున్న న్యాయాధికారి రాజగోపాల్

సంక్షేమ పథకాలు మంజూరు చేస్తాం

● మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

కూసుమంచి, జూన్ 8: రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ మొదటివిడతలో ఇళ్లు, రెండోవిడతలో ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని పర్యటనలో భాగంగా నాయకన్‌గూడెం, భగత్‌వీడు, మంగలితండా, రాజుపేట, రాజుపేట బజార్, హీరామాన్‌తండ, గోరీలపాడుతండ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులు స్వీకరించారు. వెంటనే పరిష్కరించాలని ఆయాశాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో మంత్రి మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఏఒక్కరికీ రేషన్‌కార్డులు, పక్కా ఇళ్లు ఇవ్వకుండా మోసం చేసిందని ధ్వజమెత్తారు. పాలేరు తన సొంత ఇల్లని, ఇక్కడి ప్రజలు ఇచ్చిన పదవితో అందరి సమస్యలు తీరుస్తానని తెలిపారు. రానున్న మూడేళ్లలోనే నియోజకవర్గంలోని అర్హులైన వారికి ఇళ్లు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. అతికొద్ది రోజుల్లోనే అందుకు సంబంధించి తీపికబురు అందుతుందని తెలిపారు. ఉచిత విద్యుత్ కోసం అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములన్నీ వెలికితీసి అర్హులకు ఇళ్లనిర్మాణం చేస్తామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బాణోతు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ కంచెర్ల పద్మ, ఎంపీటీసీలు, తాజామాజీ సర్పంచులు పార్టీ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

రోడ్లపైనే పశువులు..

- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై నిత్యకృత్యంగా మారిన ప్రమాదాలు
- ప్రమాద స్థలాలు గుర్తించి చర్యలు తీసుకోవాలని వినతి



జుజ్జులరావుపేట వద్ద ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు(ఫైల్)

కూసుమంచి, జూన్‌8: ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై పశువులు యథేచ్ఛగా తిరుగుతూ వాటిపైనే సేదతీరుతుండటంతో వాహన ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. వేగంగా వచ్చే పెద్ద వాహనాలతో పాటు ద్విచక్ర వాహనదారులు పశువులను ఢీకొడుతుండటంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలాంటి ప్రమాదాలు రహదారి వెంబడి ఏదో ఒక గ్రామంలో నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ఖమ్మం రూరల్‌ మండలం మద్దులపల్లి నుంచి మొదలుకొని ఖమ్మం జిల్లా సరిహద్దు నాయకన్‌గూడెం వరకు ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఆయా గ్రామాల్లో పశువులు రహదారుల పైనుంచి దాటే సమయంలో వేగంగా వచ్చే వాహనదారులు పశువులను గమనించక ప్రమాదాలకు గురవుతుండటడంతో ప్రాణసంకటంగా మారుతోంది. రాత్రి సమయాల్లో దగ్గరికి వచ్చే వరకు కనిపించకపోవడంతో పశువులను తగిలి తీవ్ర గాయాలపాలవుతున్నారు.

వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

రహదారులపై వాహనదారులు నిర్దేశిత వేగంతోనే ప్రయాణించాలి.అకస్మాత్తుగా బ్రేకులు వేయొద్దు. ఇలా చేయడం మూలంగా వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. పశువులు, కుక్కలు ఉన్నట్లు గుర్తిస్తే ముందే వేగం తగ్గించుకోవాలి. కార్లు ఇతర వాహనదారులు డివైడర్ల పక్కనుంచి కాకుండా రహదారి మార్జిన్‌ చూసుకుని నడపాలి. వర్షం వచ్చినప్పుడు అతివేగం కాకుండా నిర్దీతవేగంతో మాత్రమే నడపాలి. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ పెట్టుకుని ప్రయాణించాలి. అవసరమైతే ప్రధాన రహదారిపై కాకుండా సర్వీస్‌ రోడ్డుపై ప్రయాణిస్తే మంచిది. పశువుల పక్కనుంచి వెళ్లేటప్పుడు జాగ్రత్తగా నడపాలి. లేనిపక్షంలో అవి బెదిరి మీదనడే అవకాశం ఉంది. అండర్‌ పాస్‌లు వచ్చినప్పుడు వాహనం స్లో చేసుకుని హారన్‌ మోగించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చు.



అధికారులు దృష్టి పెట్టాలి..

జాతీయ రహదారితోపాటు, గ్రామీణ రహదారులపై పశువుల సంచారాన్ని నిలువరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా పశువులు రోడ్లపై ఎక్కకుండా బారికేడింగ్‌ ఏర్పాటు చేయాలి. హైవే అథారిటీ వాహన అధికారులు రైతులకు కొంత అవగాహన కల్పించాలి. అదేవిధంగా డివైడర్ల మధ్య మొక్కల పెంపకాన్ని చేపట్టాలి. రహదారి పొడవున ప్రమాద స్పాట్లు గుర్తించి వెంటనే సూచికలు ఏర్పాటు చేయాలి. అండర్‌ పాస్‌ల వద్ద సైడ్‌ మిర్రర్‌లు ఏర్పాటు చేయకపోవడంతో మలుపుల వద్ద కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇటీవల మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదాలు..

● మే 17న జీళ్లచెరువు వద్ద గేదె అడ్డురావడంతో కారు డ్రైవర్‌ సడన్‌ బ్రేక్‌ వేయడంతో కారు అదుపుతప్పి బోల్తా పడటంతో ఖమ్మం నగరానికి చెందిన వడ్డమూడి వెంకటేశ్వరరావు (55) అనే వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.

● మే 28న నాయకన్‌గూడెం వంతెన వద్ద గేదె అడ్డురావడంతో దానిని తప్పించబోయి ఖమ్మం నుంచి హైదరాబాద్‌ వెళుతున్న వెంకటేష్‌-గాయత్రీ దంపతులు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ప్రమాదంలో ఎవ్వరూ ఎలాంటి గాయాలు లేకుండా బయటపడ్డారు

● మే 28న జుజ్జులరావుపేట రెండు బైకులు గేదెను ఢీకొట్టడంతో హరిప్రసాద్‌, భిక్షంతోపాటు మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది.

నాణ్యమైన విత్తనాలు అందించాలి

- ఏడీసీపీ ప్రసాదరావు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

ఖమ్మంక్రైం, జూన్‌8: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యంగా ప్రత్యేక టాస్క్‌ ఫోర్సు బృందాలు సమష్టిగా పని చేయాలని అడిషనల్‌ డీసీపీ లా అండ్‌ ఆర్డర్‌ ప్రసాదరావు అన్నారు. శనివారం వ్యవసాయాధికారులు, పోలీసు అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, నాణ్యతలేని విత్తనాలు కొనుగోలు చేస్తే రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వ్యవసాయాధికారులు విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. కృత్రిమ కొరత సృష్టించి ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఎక్కడా విత్తనాల కొరత లేదన్నారు. కొంతమంది దళారులు ముఠాలుగా ఏర్పడి తక్కువ డబ్బుకు విత్తనాలు ఇస్తామని ఆశచూపి రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు. ఇటువంటి వారిపై నిఘాపెట్టాలని అధికారులకు సూచించారు. ఈసమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల, ఏడీఏలు శ్రీనివాస్‌, నర్సింహారావు, విజయచందర్‌, కరుణశ్రీ, శ్రీనివాసరెడ్డి, ఏవో కిషోర్‌, సీఐ స్వామి, పాల్గొన్నారు.

పామాయిల్‌కు గిటుబాటు ధర కల్పించాలి

- పామాయిల్‌ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి



హైదరాబాద్‌లో ఆయిల్‌ఫెడ్‌ ఎండీని అశోక్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలపాటి

దమ్మపేట, జూన్‌, 8: పామాయిల్‌కు గిట్టుబాటు ధర కల్పించే విధంగా కృషి చేయాలని పామాయిల్‌ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాద్‌ అన్నారు. శనివారం అల్లిపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పామాయిల్‌ ధర పడిపోవటంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఆయిల్‌ఫెడ్‌ ఎండీ, ఉద్యానవనశాఖ డైరక్టర్‌ అశోక్‌రెడ్డిని కలిసి పామాయిల్‌ రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందించినట్లు పేర్కొన్నారు. రైతులకు కనీసం గిట్టుబాట ధర కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. పామాయిల్‌ తోటలను పరిశీలించేందుకు శాస్త్రవేత్తలు రైతులతో కలసి కమిటీలు ఏర్పాటు చేసి సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు సలహాలు సూచనలు అందించాలన్నారు. పామాయిల్‌ నర్సీల పెంపకాన్ని ఉద్యానశాఖకు అప్పంచగించాలని ఆలపాటి విజ్ఞప్తి చేశారు. ఆయిల్‌ఫెడ్‌ ఎండీని కలిసిన వారిలో ఆలపాటితో పాటు రైతులు దొడ్డాప్రసాదు, బండి భాస్కర్‌ తదితరులున్నారు.

32 గంటల నిర్విరామ గానం షురూ



- రికార్డు నమోదు గాన కార్యక్రమంలో పాడుతున్న మాలతీనాయుడు

ఖమ్మం సాంస్కృతికం, జూన్‌ 8: తెలుగు సినిమా పాటలను 32 గంటల పాటు ఏకబిగిన ఆలపించడం ద్వారా రికార్డు సృష్టించే కార్యక్రమం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో శనివారం ప్రారంభ మైంది. ఆదివారం రాత్రి 7 గంటల వరకు కొనసాగే ఈ నిర్విరామ గాన కార్యక్రమానికి పలు హిట్‌ చిత్రాల్లోని దాదాపు 400 పాటలను ఎంపికచేశారు. ఈ గీతాలాపనలో 32 మంది గాయకులు పాటలను పాడనున్నారు. ఖమ్మంకు చెందిన గాయని వంజా మాలతీనాయుడు తన పేరిట రికార్డు నమోదు చేసేందుకు గాను ఈ కార్యక్రమాన్ని ఎంచుకున్నారు. ఇందు కోసం రెండు తెలుగు రాష్ట్రాల్లోని గాయనీ గాయకుల సహాయం తీసుకుంటున్నారు. జీనియస్‌ బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌, వండర్‌ బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌, తెలుగు బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌ లలో చోటు సాధించేందుకు ఆమె ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ పాటలకు మేల్‌ సింగర్స్‌, కోరస్‌ తదితర గాత్రాలకోసం గాయకులు పాటలను బట్టి మారుతుంటారు. మాలతీ నాయుడు మాత్రం అన్ని పాటల్లో ఫిమేల్‌ వాయిస్‌ తానే పాడనున్నారు. సుదీర్ఘ పాటల కార్యక్రమాన్ని నమోదు చేసేందుకు జీనియస్‌ బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌, వండర్‌ బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌, తెలుగు బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌ ప్రతినిధులు హాజరయ్యారు. తొలిరోజు గాయకులు పలు హిట్‌ పాటలను ఆలపించి అలరించారు. ప్రారంభ కార్యక్రమంలో ఖమ్మం కళాపరిషత్‌ అధ్యక్షుడు డాక్టర్‌ నాగబత్తిని రవి, నెల నెలా వెన్నెల సాంస్కృతిక సంస్థ ప్రతినిధి ఎ. సుబ్రమణ్య కుమార్‌, పారుపల్లి సురేష్‌, కమర్తపు శ్రీధర్‌, ఇసనపల్లి నగేష్‌ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామికి సర్వాంగాభిషేకం

ఎర్రుపాలెం జూన్‌ 8: జమలాపురం శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి సర్వాంగాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించారు. స్వామి ముత్యాల కవచ అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. భక్తుల రద్దీతో క్యూలైన్లు నిండిపోయాయి. శ్రీవారి ఆలయంతో పాటు భక్తులు ఉప ఆలయాలను దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు ఉచిత అన్నదాన వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్‌ కె.విజయకుమారి, జూనియర్‌ అసిస్టెంట్‌ కృష్ణప్రసాద్‌, వేదపండితులు, అర్చకులు, సిబ్బంది సాయి, వంశీ, విజయ్‌, మారుతీరావు, విజయ్‌, మస్తాన్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న దైవ మందిరాలకు ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త జమలాపురం గ్రామవాసి తుళ్లూరి కోటేశ్వరరావు, నిర్మలకుమారి దంపతులు శనివారం విరివిగా విరాళాన్ని అందజేశారు. జమలాపురం గ్రామంలోని నూతనంగా నిర్మిస్తున్న సీఎస్‌ఐ చర్చి నిర్మాణానికి సుమారు రూ.10 లక్షల విలువగల ఐరన్‌, సిమెంట్‌, గ్రావెల్‌ మెటీరియల్‌ను సంఘస్తులకు అందిచారు. ఎస్టీకాలనీలో బంజారాల ఆరాధ్యదైవం సంత్‌ సేవాలాల్‌ మహారాజ్‌ మందిర నిర్మాణానికి రూ.5లక్షల నగదును ఆలయ కమిటీకి అందజేశారు. తండాలో సేవాలాల్‌ కోలాట నృత్య సమాజానికి కోలాట దుస్తులను వితరణ చేశారు. నూతన దుస్తులతో బంజారాలు ఉత్సాహంగా కోలాట నృత్యం చేశారు. ఈ సందర్భంగా తుళ్లూరి దంపతులను గ్రామస్థులు అభినందించారు.



బంజారాలకు విరాళం అందజేస్తున్న తుళ్లూరి దంపతులు

మాఊర్లో మారాజ్యం కోసం పోరాటం

- జాతీయ ఆదివాసీ సంఘాల జేఏసీ నాయకుడు చందాలింగయ్య దొర

కరకగూడెం, జూన్‌ 8: ఆదివాసీలు మా ఊర్లో మారాజ్యం కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని జాతీయ ఆదివాసీ సంఘాల జేఏసి నాయకులు చందా లింగయ్య దొర అన్నారు. శనివారం శనివారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహబూబాబాద్‌ పార్లమెంట్‌లో కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌, బీజేపీ పార్టీలు ఆదివాసీలకు ఎంపీ టికెట్లు ఇవ్వకుండా మొండి చేయి చూపించాయని ఆరోపించారు. 2009 నుంచి 2024 వరకు ఓకే సామాజిక కులం అయిన లంబాడాలకు సీట్లు కేటాయించి ఆదివాసీ జాతిని రాజకీయ సమాధి చేస్తున్నారని ఆరోపించారు. ఈ రాజకీయ పార్టీలకు ఆదివాసీలు కన్పించడం లేదని నిరసనగా స్వతంత్ర అభ్యర్థిగా ఎంపీగా పోటీలో దిగినట్లు తెలిపారు. ఆదివాసీ రాజ్యాధికారం కోసం మహబూబాబాద్‌ పార్లమెంట్‌ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో జాతీయ ఆదివాసీ అఖిలపక్ష ప్రజా సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న తన ఆధ్వర్యంలో ఓ కూటమిని ఏర్పాటు చేసుకుని ఒకే ఆదివాసీ ఒకే అభ్యర్థిగా ఎంపీ స్థానానికి నిలబెట్టాలని అనేక చర్చా వేదికలను మూడు నెలలుగా నిర్వహించామన్నారు. ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టి నామినేషన్‌ వేయడం జరిగిందన్నారు. అయితే అదివాసీ సంఘాల మధ్య నాయకుల మధ్య విభేదాలు సృష్టించి ప్రలోభాలకు లోను చేసి పలుకుట్రలకు ఆయా పార్టీల నాయకులు పాల్పడ్డారని ఆరోపించారు.

క్రైం సమాచారం

బంగారం, నగదు చోరీ

దుమ్ముగూడెం, జూన్‌ 8: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చొరబడి నగదు, బంగారం చోరీ చేసిన సంఘటన దుమ్ముగూడెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..దుమ్ముగూడేనికి చెందిన బైరెడ్డి భానుకిరణ్‌ ఈనెల 7న ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌ వెళ్లాడు. కాగా శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి బీరువాలోని అరపై గ్రాముల బంగారం, వెండి ఆభరణాలతోపాటు, రూ.52వేల నగదు చోరీ చేశారు. శనివారం ఉదయం ఇంటి తలుపులు ఉండడం గమనించి స్థానికులు ఇంటి యజమానికి సమాచారం అందించారు. కిరణ్‌ పిన్ని బైరెడ్డి నిర్మల చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీఐ అశోక్‌ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

పిడుగుపాటుకు దగ్ధమైన గృహోపకరణాలు

పాల్వంచ, జూన్‌ 8: పాల్వంచ పట్టణ పరిధిలోని ఒడ్డుగూడెంలో శనివారం పిడుగుపడి గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. విశ్రాంత ఉపాధ్యాయుడు జనకిరాములు ఇంటి ఆవరణలో పిడుగుపడంతో చుట్టు పక్కల ఇండ్లలో ఫ్యాన్లు, బల్బులు, ఇతర గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. కానీ ఎవ్వరికీ ఎటువంటి ప్రమాదం జరగపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జూలూరుపాడు, జూన్‌8: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని పాపకొల్లు గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాపకొల్లు గ్రామానికి చెందిన పెద్దమళ్ల కృష్ణప్రసాద్‌ ద్విచక్రవాహనంపై పాపకొల్లు నుంచి జూలూరుపాడు వైపు వస్తుండగా, జడల చింత గ్రామానికి చెందిన బొప్పిరెడ్డి వంశీ స్వగ్రామం నుంచి పాపకొల్లు వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రెండు ద్విచక్రవాహనాలు పాపకొల్లు గ్రామ శి వారులో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను జూలూరుపాడులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం 108లో కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రిని పోలీసులు సందర్శించి ప్రమాద వివరాలను నమోదు చేసుకున్నారు.

రైలు ఢీ కొని మేకల కాపరికి..

మణుగూరు, జూన్‌ 8: రైలు ఢీకొని మేకల కాపరికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం మణుగూరులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వాపురం మండలం గొందిగూడెం గ్రామానికి చెందిన సున్నం సీతారాములు మేకలు కాసుకుంటూ రైల్వే ట్రాక్‌ దాటుతుండగా ప్రమాదవశాత్తూ రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన అతడిని స్థానికులు మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఐదు కేజీల గంజాయి పట్టివేత

ఖమ్మం క్రైం జూన్‌ 8: గంజాయి తీసుకువెళుతున్న యువకుడిని శనివారం వన్‌ టౌన్‌ పోలీసులు ఖమ్మం రైల్వే స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన లాలురైటా అనే యువకుడు రైలు ద్వారా ఐదు కేజీల గంజాయిని ముంబైకి తీసుకెళ్తున్నాడు. ఖమ్మంలో రైలు దిగి బయటకు వస్తుండగా అనుమానం వచ్చిన వన్‌టౌన్‌ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో అతడి బ్యాగులో ఉన్న సుమారు ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గోడకూలి వృద్ధుడు మృతి

ఖమ్మం క్రైం జూన్‌ 8: గోడకూలి వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఖమ్మం నగర పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపురంలో నివాసముంటున్న చింతల అంజయ్య(63) గత మే నెల 5న సాయంత్రం ఆరు గంటల సమయంలో ఇంటిగోడ కూలి మీద పడింది. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య భూలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు...

కరకగూడెం, జూన్‌ 8: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని చొప్పాల గ్రామంలో శనివారం చోటుచుసుకుంది. చొప్పాల గ్రామానికి చెందిన ఏడూళ్ల సమ్మయ్యకు చెందిన ఈ దుక్కిటెద్దు మేతకు వెళ్లి వస్తున్న క్రమంలో శుక్రవారం రాత్రి శ్రీరంగపురం గ్రామ శివారున గల ఓ రైతు పొలంలో తెగిపడిన 11 కేవీ విద్యుత్‌ తీగను తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపారు తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మొక్కు బడిబాట

- అవగాహన కార్యక్రమంలోనే నిర్లక్ష్యం
- బడిబాట సమయపాలన షెడ్యూల్‌ పాటించని ఉపాధ్యాయులు

రఘునాథపాలెం, జూన్‌ 8: ఖమ్మం నగరానికి సమీపంలోనే ఉన్న రఘునాథపాలెం విద్యా ప్రమాణాల్లో పదేళ్లుగా వెనుకబడి ఉంటుంది. గత ప్రభుత్వంలో రహదారులు, గ్రామ పంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారించిన మంత్రులు విద్యా ప్రమాణాలపై కనీసం రివ్యూలు నిర్వహించలేదు. దీంతో జిల్లాలోని మారుమూల మండలాలు పదో తరగతిలో 90శాతానికి పైగా ఫలితాలు సాధిస్తుండగా, రఘునాథపాలెం మండలంలో 70శాతంకు మించిలేదు. ఇక ఏడాది మొదలైన బడిబాట మొక్కుబడి బాటగా మారిందని విమర్శలు వెలువడుతున్నాయి. ఈనెల 6న బడిబాట ప్రారంభం అయ్యింది. మొదటి రోజు గ్రామ సమాఖ్యలతో ఉపాధ్యాయులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. తర్వాత కాలంలో విద్యాశాఖ షెడ్యూల్‌ మేరకు ఈనెల 11వరకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఉదయం 7గంటలకే ఉపాధ్యాయులు వారు పనిచేస్తున్న పాఠశాలల గ్రామాలకు వెళ్లి 11గంటల వరకు ఉండి ప్రజలకు అవగాహన కల్పించి ప్రైవేట్‌ బడుల పిల్లల్ని ప్రభుత్వ బడులకు మార్చే విధంగా కార్యచరణ చేయాలి. అంగన్వాడీ కేంద్రంలో విద్యాభ్యాసం చేస్తున్న పిల్లలను వారి అర్హతల మేరకు గుర్తించాల్సి ఉంటుంది. అయితే ఉదయం 7గంటలకు గ్రామాలకు వెళ్లాల్సిన ఉపాధ్యాయులు ఉదయం 9గంటలకు వెళ్తున్నారు. ఒక గంటన్నరపాటు ఉంటూ ఉదయం 10.30గంటలకు తిరుగు ప్రయాణం చేస్తున్నారు. దీంతో బాడి బాట మొక్కు బడిగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బడిబాట కార్యక్రమం ప్రారంభమైన తర్వాత కూడా ప్రభుత్వ పాఠశాలల నిర్వాహణ తీరు మారడం లేదని విమర్శలు వెలువడుతున్నాయి. గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు బడి నుంచి ఇంటికి రాగానే సమీపంలోని గ్రామస్థులు తమ పశువులను ప్రభుత్వ బడిలో ఉంచుతున్నారు.



గడ్డికుంటతండలోని ప్రభుత్వ బడిలో పశువులు కట్టేసిన దృశ్యం

కొన్ని పాఠశాలల్లో విద్యార్థులతో పాఠశాలలను శుభ్రం చేయిస్తున్నారు. ఇటువంటి ఫొటోలు మండలంలో సోషల్‌ మీడియాలో వైరల్‌గా మారాయి.

ఈ విషయంపై ఎంఈవో శ్రీనివాసరావును వివరణ కోరగా ఈనెల 6న నుంచి బడిబాట కార్యక్రమం ప్రారంబించామని, సమయపాలనతో అవగాహన కార్యక్రమాలు పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. 12నుంచి పాఠశాలలకు నూతన అడ్మిషన్లు చేపడ్తామన్నారు.

వాహనాల చోరీ ముఠా అరెస్ట్‌

- పోలీసుల అదుపులో ఏడుగురు నిందితులు
- వివరాలు వెల్లడించిన ఇన్‌స్పెక్టర్‌ కరుణాకర్‌

కొత్తగూడెం పోస్టాఫీస్‌ సెంటర్‌, జూన్‌8: వాహనాలను చోరీ చేస్తున్న ఏడుగురు సభ్యుల ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం వన్‌టౌన్‌ ఇన్‌స్పెక్టర్‌ కరుణాకర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం బస్టాండ్‌ సెంటర్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా వన్‌టౌన్‌ పోలీసులకు ఓ కారు అనుమానాస్పదంగా కనిపించింది. అందులో ప్రయాణిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని విచారించగా, కారులో ఉన్న ఏడుగురు వ్యక్తులు దొంగతనాలకు పాల్పడుతుంటామని తెలిపారు. ఈ ముఠాలో పెనుబల్లికి చెందిన గోపి, శ్రీనులు వీరు చుంచుపల్లి మండలంలోని విద్యానగర్‌ కాలనీ ప్రాంతంలో నివాసం ఉంటూ, వీ.ఎం.బంజరకు చెందిన ముత్తారావు, శివరాం, కోటయ్య, గద్దల శివ, లక్ష్మణరావులతో కలిసి ఒక ముఠాగా ఏర్పడి వరుస దొంగతనాలు చేస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం ప్రాంతాలలో నివాస ఇల్లుల మధ్య పార్కింగ్‌ చేసి ఉన్న ఆటోలను, బైకులను, కార్లను దొంగిలించి అమ్ముకుని వచ్చిన సొమ్మును అందరూ పంచుకునేవారని తెలిపారు. ఈ క్రమంలో కొత్తగూడేనికి చెందిన ఒక ఆటోను అమ్మేందుకు వచ్చి పోలీసులకు పట్టుబడినట్లు తెలిపారు. వీళ్ల అందరూ కార్లలో తిరుగుతూ దొంగతనాలు చేయడం అలవాటుగా చేసుకున్నారని ఎస్‌ఐ తెలిపారు. వీరందరినీ అరెస్ట్‌ చేసి రిమాండ్‌ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు తెలిపారు. పట్టుబడిన వీరివద్ద నుంచి కారు, బైక్‌, మూడు ఆటోలను స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్‌ వివరాలు వెల్లడించారు. కొత్తగూడెం వన్‌టౌన్‌ ఎస్‌ఐ రవి, హెడ్‌కానిస్టేబుల్‌ గని, సిబ్బంది రాజు, రాందాస్‌, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



వాహనాలు చోరీ చేసే ముఠా సభ్యులతో పోలీసులు

ఎన్నికల హామీలను అమలు చేస్తాం

● ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌

కారేపల్లి, జూన్‌8: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని వైరా ఎమ్మెల్యే మాలోత్‌ రాందాస్‌నాయక్‌ అన్నారు. శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్‌నాయకుడు యాకుబ్‌ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన వారందరికీ గృహలు మంజూరు చేస్తామన్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన జవ్వాజీ కళావతి దశదిన కర్మలకు హాజరై కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంటపలువురు కాంగ్రెస్‌ పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల కేంద్రం నుంచి పేరుపల్లి వెళ్లే ప్రధానరహదారిలో గల తులశ్యపండవద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వన్యంగా తయారైందని,రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కాంగ్రెస్‌ మండల నాయకుడు సాపవత్‌ నాగులు ఎమ్మెల్యే రాందాసనాయక్‌ను కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అక్కడనుంచే ఫోన్‌లో అధికారులతో మాట్లాడి పనులు పూర్తి చేయలని సూచించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌

నేడే జేసీజే మోడల్‌ టెస్ట్‌

ఖమ్మం లీగల్‌ జూన్‌ 8: అఖిలభారత న్యాయవాదుల సంఘం(ఐలు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్‌ సివిల్‌ జడ్జి(జేసీజే) ఎగ్జామ్‌ రాసే న్యాయవాదుల కోసం ఈ మోడల్‌ టెస్ట్‌ నిర్వహించడం జరుగుతుందని ఐలు ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి సెక్రటరీ, జిల్లా అధ్యక్షుడు మీసాల వెంకటేశ్వర్లు, నల్లమల నవీన్‌చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. కావునా ఆదివారం ఉదయం 10 గంటలకు ఖమ్మం బార్‌ అసోసియేషన్‌ హాల్‌లో ఈ టెస్ట్‌ జరుగుతుందని, జేసీజె ఎగ్జామ్స్‌ రాసే న్యాయవాదులు ఈ జేసీజె మోడల్‌ టెస్ట్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కూటమి గెలుపుతో మొక్కులు చెల్లించుకున్న కృష్ణా జిల్లా వాసులు

ఎర్రుపాలెం, జూన్‌ 8: ఏపీలో టీడీపీ కూటమి విజయం సాధించడంతో ఎర్రుపాలెంలోని జమలాపురం ఆలయంలో కృష్ణా జిల్లా వాసులు మొక్కులు చెల్లించుకున్నారు. జమలాపురం ఆలయం తెలంగాణ, ఆంధ్రా సరిహద్దుప్రాంతం కావటంతో ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలో టీడీపీ కూటమి అఖండ విజయం సాధించడంతో తెలుగుదేశం పార్టీ శ్రేణులు శ్రీవారి మొక్కులు తీర్చుకునేందుకు వేలాదిగా ఆలయానికి తరలివచ్చారు. ఎన్టీఆర్‌ కృష్ణా జిల్లా మొరసుమిల్లి, గూడెం మాధవరం, జయంతి, పెద్దాపురం, పరిటాల, చౌటపల్లి, అమ్మిరెడ్డిగూడెం నుంచి ట్రాక్టర్లకు పార్టీ జెండాలు కట్టి ఒక్కసారిగా రావడంతో ఆలయ ప్రాంగణమంతా జెండాలతో పసుపుమయంగా మారింది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడితే మొక్కులు చెల్లిస్తామని శ్రీవారిని మొక్కుకున్నట్లు వారు తెలిపారు.



మొక్కులు చెల్లించుకుంటున్న టీడీపీ నాయకులు

మంత్రి పొంగులేటిని కలిసిన కమలాపురం వాసులు

మణుగూరు, జూన్ 8: మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని కమలాపురం వాసులు కొందరు శనివారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఖమ్మంలో కలుసుకుని తమ గోడు వెల్లబోసుకున్నారు. ప్రతి వర్షాకాలం గోదావరి నది పోటెత్తడం వల్ల ఆ నీరు తమ నివాసాలను ముంచుతున్నాయని తెలిపారు. తమ సమస్య పరిష్కారం కోసం స్థానికులు ఎగువ ప్రాంతంలో ఉన్న ఫారెస్టు భూమిలో ఇంటి నిర్మాణాలు చేపట్టుకున్నామని ఇప్పుడు ఫారెస్టు అధికారులు ఇండ్లను తొలగించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారని మంత్రికి ఫిర్యాదు చేశారు. స్పందించిన మంత్రి డిఎఫ్‌ఓకు ఫోన్ ద్వారా పలు సూచనలు చేసినట్లు నాయకులు దొబ్బల వెంకటప్పయ్య ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఇది ఇలా ఉండగా రిజ్వర్డ్ ఫారెస్టు భూమిలో ఉన్న చెట్లను ఇటీవలే నరికి నేలను చదును చేస్తూ భూ విక్రయాలు జరుగుతున్నట్లు కథనాలు వచ్చిన సంగతి తెలిసిందే.

మల్లన్న గెలుపుతో సత్తా చాటిన కాంగ్రెస్

అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట, జూన్ 8: పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించి కాంగ్రెస్ పార్టీ తన సత్తాను మరొకసారి చాటిందని అశ్వారావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ అన్నారు. నాచారం గ్రామంలో శనివారం జరిగిన సమావేశంలో జారే మాట్లాడుతు పార్లమెంట్ ఎన్నికల ఫలితాలలో కాంగ్రెస్ ఎంపీగా రామసహాయం రఘురాంరెడ్డిని బారీమెజార్టీతో గెలిపించారని అన్నారు. అదేవిధంగా పట్టభద్రుల ఎన్నికల్లో తీన్మార్ మల్లను గెలిపించి పట్టభద్రులు సత్తాచాటరన్నారు. తీన్మార్ మల్లన్నను గెలిపించేందుకు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, పట్టభద్రులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

కొత్తగూడెంలో మల్లన్న గెలుపు సంబురాలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్: ఎమ్మెల్సీ పట్టభద్రుల ఉప ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న విజయం సాధించడం పట్ల కొత్తగూడెంలో అభిమానులు శనివారం సంబురాలు నిర్వహించారు. ఈ గెలుపు ప్రజల గెలుపు అని తెలంగాణ రాష్ట్ర తీన్మార్ మల్లన్న కమిటీ సభ్యులు మొహ్మద్ రియాజ్ ఆనందం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో నిరుద్యోగుల పట్ల, ఉద్యోగుల పట్ల విద్యార్థులకు మంచి రోజులు వస్తున్నాయని దీమా వ్యక్తం చేశారు. కన్న కళలు నిజం చేసేందుకు చట్ట సభల్లో ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్న తన గళం వినిపిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధులు 1969 అధ్యక్షులు వి.శాంతిరాం, సభ్యులు



నాచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే

చింతల చెరువు గిరీశం, ఉద్యమకారులు బండి రాజ్‌గౌడ్, అజయ్, రజాక్, కాసుల వెంకట్, బషీర్, వెంకట్, గోబ్రానాయక్, సయ్యద్ షకీల్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లిలో..

అన్నపురెడ్డిపల్లి: తీన్మార్ మల్లన్న విజయం పట్ల మండలంలోని అబ్బుగూడెం గ్రామంలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఇటీవల ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డి, తీన్మార్ మల్లన విజయంపై కాంగ్రెస్ జిల్లా నాయకులు పర్సా వెంకటేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు.

దుమ్ముగూడెంలో..

దుమ్ముగూడెం: తీన్మార్ మల్లన్న గెలుపు నేపధ్యంలో మండల కాంగ్రెస్ శ్రేణులు లక్ష్మీనగరం కూడలిలో సంబరాలు జరుపుకున్నారు. విజయోత్సవ వేడుకలు నిర్వహించి స్వీట్లు పంచారు. టీం అధ్యక్షుడు సిద్ది ప్రవీణ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వినీల్, మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, అప్పలరెడ్డి, వెంకటరమణారెడ్డి, స్వామి, శేఖర్, సందీప్‌రెడ్డి, శ్రీధర్, బాలాజీ, నాగరాజు, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచలో..

పాల్వంచ: ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న గెలుపుతో పాల్వంచలో కాంగ్రెస్ శ్రేణులు శనివారం సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎడవల్లి కృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎడవల్లి నివాసానికి చేరుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎడవల్లి మాట్లాడుతూ కేసీఆర్ నిరంకుశ పాలను నిలదీసిన వ్యక్తి మల్లన్న అని, అతనిది ప్రశ్నించే గొంతుక అని అన్నారు. తీన్మార్ మల్లన్నకు ఓటు వేసి ఆయనను ఎమ్మెల్సీగా గెలిపించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జలీల్, వీరయ్య చౌదరి, గద్దల రమేష్, చారి, కట్టా సోమయ్య, పెంకి శ్రీను, దొప్పలపూడి సురేష్, యమహా రమేష్, చింతా నాగరాజు, చెన్నమల్లు, షఫీ, బాను, దేవీలాల్, నాగిరెడ్డి, రవిగౌడ్, రంగయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మృగశిర కార్తె సందడి

చేపల కోసం ఎగబడిన ప్రజలు.. జోరుగా సాగిన విక్రయాలు



కరకగూడెంలో చేపల కోసం వచ్చిన వారు

కరకగూడెం, జూన్ 8: మండలంలో శనివారం మృగశిర కార్తె సందర్భంగా మండల ప్రజలు చేపలు కొనేందుకు ఎగబడ్డారు. మండల కేంద్రంలోని సమత్ భట్టుపల్లి పంచాయితీ కుర్నవల్లి గ్రామ పరిధిలో ఉన్న అశోక్‌అనే రైతు తన పోలంలో ఏర్పాటు చేసిన చేపల చెరువులో సాదుడు చేపలు పట్టాడు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల ప్రజలు చేపల చెరువు వద్దకు చేరుకుని ఈ చేపలను కొనగోలు చేశారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు: మృగశిర కార్తెను పురస్కరించుకొని శనివారం జూలూరుపాడు మండలంలో చేపల విక్రయాలు జోరుగా సాగాయి. వివిధ గ్రామాలకు చెందిన వ్యాపారులు జూలూరుపాడు ప్రధాన రహదారి ప్రక్కన చేపలను విక్రయించారు. మృగశిర కార్తె కావడంతో ప్రజలు చేపలను కొనుగోలు చేసేందుకు పోటీ పడ్డారు. కేజీ రూ.170 నుంచి రూ.190 వరకు విక్రయించారు. ధర పెరిగినప్పటికి ప్రజలు చేపలను కొనుగోలు చేయడానికి వెనుకాడలేదు.

పెరిగిన చేపల ధరలు

ఇల్లెందు: ఇల్లెందులో మృగశిర కార్తె కొలాహలంతో చేపల కోసం ప్రజలు ఎగబడ్డారు. చెరువుల్లో నీరు లేక ఈ ఏడాది చేపలు చెరువు వద్ద లభ్యంకాక బుగ్గవాగు, గోవింద్‌సెంటర్, జేకే కాలనీ, కరెంట్ ఆఫీస్, సెంటర్ల వద్ద చేపల రకాలను బట్టి కిలో రూ.200నుంచి 300వరకు రేట్లతో కొనుగోలు చేశారు. కొర్రమేను పెద్దగా లభ్యం కాలేదు. అయితే అందుబాటులో ఉన్న కొర్రమేను కిలో 4నుండి 5వందల ధరలతో విక్రయాలు జరిగాయి. చేపల అమ్మకాలు వద్దనే క్లీనింగ్ చేసేందుకు క్లీనింగ్‌కు కిలో రూ.40 వరకు వసూలు చేశారు.

చేపలకు పెరిగిన గిరాకీ..

అశ్వాపురం: మృగశిర కార్తె ప్రవేశం సందర్భంగా శనివారం చేపలకు ఒక్కసారిగా గిరాకీ పెరిగింది. కొర్రమేను చేప ఏకంగా కేజీ రూ.500కు చేరింది. మామూలు చేపలు కేజీ రూ.250 నుంచి 300 వరకు పెరిగింది. కార్తె ప్రారంభం రోజున చేపలకూర తింటే దీర్ఘకాలిక వ్యాధులు నయం కావటంతో పాటు ఆరోగ్యంగా ఉంటామన్న నమ్మకం ఉండటం మూలంగా జనం మార్కెట్‌లో పోటెత్తడంతో వ్యాపారులు రేట్లు పెంచారు. మామూలు రోజుల్లో కొర్రమేను రూ.350 ఉండగా, రూ.500లకు, మామూలు చేపలు రూ.120 నుంచి రూ.250కి కార్తె సందర్భంగా విక్రయించారు. రెండు రోజుల ముందుగానే ఆంధ్రాలోని భీమవరం, ఏలూరు ప్రాంతాల నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకుని నిల్వ ఉంచుకున్నారు. అశ్వాపురంతో పాటు పలు చోట్ల భారీగా విక్రయాలు జరిగాయి.

గ్రామ దేవతలకు ఘనంగా పూజలు



పూజలు చేస్తున్న మహిళలు

జూలూరుపాడు, జూన్ 8: మండలంలోని సాయిరాంతండాలో శనివారం గ్రామ దేవతలకు గిరిజనులు ఘనంగా పూజలు నిర్వహించారు. గ్రామంలో నాభిశిల, ఆంజనేయస్వామి ఆలయం, ముత్యాలమ్మతల్లి, పోతురాజులను ప్రతిష్ఠించి మూడేళ్ళు కావడంతో కొలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్థులు గ్రామ దేవతలకు జలాభిషేకం చేసి అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి తమ భక్తి పరవశ్యాన్ని చాటుకున్నారు. మొక్కులను చెల్లించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

ఇల్లెందు కోర్టు న్యాయాధికారి కీర్తి చంద్రికారెడ్డి

ఇల్లెందుటౌన్, జూన్ 8: లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సత్వరన్యాయం అందుతుందని ఇల్లెందు కోర్టు జడ్జ్ కీర్తి చంద్రికారెడ్డి సూచించారు. శనివారం ఇల్లెందు కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని, ఎలాంటి అప్పీల్‌కు అవకాశం లేదన్నారు. రాజీ పడగదగిన కేసులలో ఇరువర్గాల కక్షిదారులు కోర్టుకు వచ్చి రాజీ కుదుర్చుకున్నట్లైతే పరిష్కారం లభిస్తుందన్నారు. ఎవరు నష్టపోకుండా ఇరువర్గాలు గెలిచినట్టేనని ప్రకటించారు. గ్రామ స్థాయిలో పంచాయితీ నిర్వహించి రాయించుకున్న అగ్రిమెంట్లు కోర్టులో చెల్లుబాటు కావని, వాటికి చట్టబద్దత లేదని తెలిపారు. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీ మార్గం ద్వారా అనేక కేసులకు పరిష్కారం లభిస్తుందని, లోక్ అదాలత్‌లలో సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు భుక్యా రవికుమార్ నాయక్, ప్రధాన కార్యదర్శి కే. ఉమామహేశ్వరావు, సంయుక్త కార్యదర్శి కీర్తి కార్తిక్, లోక్ అదాలత్ సభ్యులు నవీన్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు చెన్నకేశవరావు, తుమ్మలపల్లి ప్రభాకర్, దంతాల ఆనంద్, బాలకృష్ణ, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



కేసులను పరిశీలిస్తున్న న్యాయాధికారి చంద్రికారెడ్డి

నిరుపేద మహిళలకు గొడుగుల పంపిణీ



గొడుగులు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

బూర్గంపాడు, జూన్ 8 : ఐటీసీ అనుబంధ సేవా సంస్థ రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా సారపాక ఆధ్వర్యంలో పది మంది నిరుపేద చిరువాపార మహిళలకు నీడ నిచ్చేందుకు పెద్ద గోడుగులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రణవ్ శర్మ మాట్లాడుతూ.. సంస్థ తరుపున అందజేసిన ఈ గొడుగులను తమ జీవనోపాధికి చేదోడుగా ఉంటాయని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని సూచించిరు. ఈ కార్యక్రమంలో యూనిట్ హెడ్ ప్రణవ్ శర్మ, రోటరీ ప్రెసిడెంట్ జయంత్ కుమార్‌దాసు, సభ్యులు చెంగళరావు, నాగమల్లేశ్వరరావు, డివిఎం నాయుడు, కునిశెట్టి రాంబాబు, యోసోబు, సుదాకర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, చంద్రశేఖర్, ప్రతాప్, ఎంఎస్‌కే ఎన్‌జీవో అధికారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 21 కేసులు రాజీ



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయాధికారి వెంకటేశ్వర్లు

భద్రాచలం, జూన్8: భద్రాచలం జ్యూడిషల్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 21 కేసులు రాజీ అయినట్లు జడ్జీ ఎం.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. లోక్ అదాలత్ కేసుల్లో భాగంగా 89 జరిమానా కేసులు, 834 పెట్టీ కేసులు, బ్యాంకు పీఎల్‌సీ 40 కేసుల్లో మొత్తం 51,00,000 నగదు వసూళ్లు అయినట్లు తెలిపారు. ఇందులో 990 కేసులు రాజీ అయినట్లు ఆయన చెప్పారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మణుగూరు మెజిస్ట్రేట్ సూరిరెడ్డి



మాట్లాడుతున్న న్యాయాధికారి సూరిరెడ్డి

మణుగూరు, జూన్ 8: రాజీ మార్గమే రాజమార్గం.. లోక్ అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకుని కేసులను పరిష్కరించుకోవాలని మణుగూరు కోర్టు మెజిస్ట్రేట్ సూరిరెడ్డి తెలిపారు. శనివారం కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిష్కారానికి అనువుగా ఉన్న కేసులను కక్షిదారులు రాజీ మార్గంలో పరిష్కరించుకునే అవకాశం లోక్ అదాలత్ కల్పిస్తుందన్నారు. సమస్యలను పరిష్కరించుకుని ప్రశాంత జీవనం సాగించాలని కోరారు. రాజీ మార్గం ద్వారా అనేక కేసులు పరిష్కారం అవుతాయని అన్నారు. లోక్ అదాలత్‌లలో సత్వర న్యాయం లభించే విధంగా కృషి జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కక్షిదారులకు సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమంలో ఎంసీ, ఎస్‌టీసీ సీసీ ఎన్ఐ కేసులు మొత్తం 373 కేసులు పరిష్కరం అయినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. సీసీ అడ్మిషన్, ఎస్‌టీసీ కేసులకు సంబంధించి రూ. 2,64,950ల జరిమానాను జడ్జి సూరిరెడ్డి విధించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎస్వో టూ జీఎంకు ఏఐటీయూసీ నేతల వినతి

మణుగూరు, జూన్ 8 : మణుగూరు ఏరియాలోని ఓసీ ప్రాజెక్టు లో పనిచేసే హిందుస్థాన్ ట్రేడ్ ఓవర్సిస్ ప్రవేటు కంపెనీలో పనిచేసే కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు ఏరియా ఎస్వోటూ జీఎం శ్యాంసుందర్‌కు శనివారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నాయకులు అదెర్ల సురేందర్ మాట్లాడుతూ.. కార్మిక వేతన చట్ట ప్రకారం వేతనాలు అడిగితే ఆ కార్మికులను సదరు యాజమాన్యం విధుల నుంచి తొలగిస్తోందన్నారు. అనేక సార్లు విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లినా పట్టింపు దోరణి కన్పించడం లేదన్నారు. తొలగించిన వారిని వెంటనే పనుల్లో తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్ట ప్రకారం వారికి వేతనాలు చెల్లించాలని, రోజుకు 12 గంటల పాటు పని చేయించుకునే సంస్కృతిని మానుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే కార్మికులు సమ్మకు దిగేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి యాజమాన్యం సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలతో కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. వాటని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.వెంకటేశ్వర్లు, అవినాష్, జావీద్, శివ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

జర్నలిస్ట్‌పై దాడి హేయమైన చర్య

పాల్వంచ, ములకలపల్లి జర్నలిస్ట్ నేతలు

పాల్వంచ, జూన్ 8: ములకలపల్లి జర్నలిస్ట్ సుభాష్‌పై దాడి హేయమైన చర్య అని, అతనిపై దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని పాల్వంచ, ములకలపల్లి జర్నలిస్టు నేతలు డిమాండ్ చేశారు. శనివారం పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వ్యక్తిగత కక్షలతో హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తులపై పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జర్నలిస్టులతో మాట్లాడిన డీఎస్పీ స్వయంగా విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు సుభానీ, సంజీవ్‌కుమార్, చంద్ర నరసింహారావు, తోట రామకృష్ణ, ముత్యాల శేఖర్, క్రాంతి, బషీర్, పోటు పుల్లారావు, వెంగళరావు, తోట శ్రీనివాసరావు, కొప్పుల రవీందర్, మహేష్, వెంకటనారాయణ, పుల్లారావు, నాగేశ్వరరావు, ఉదయ్ పాల్గొన్నారు.

జర్నలిజానికి మార్గదర్శి రామోజీ

టీయూడబ్ల్యూజే (ఐజేయు) జాతీయ కౌన్సిల్ సభ్యుడు రామారావు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్ 8: జర్నలిజానికి నిజమైన మార్గదర్శి రామోజీరావు అని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జాతీయ కౌన్సిల్ సభ్యుడు దుద్దుకూరి రామారావు అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుకు సంతాప సభ శనివారం కొత్తగూడెం క్లబ్‌లో ఏర్పాటు చేసి నివాళులర్పించారు. తొలుత ఆయన ఫ్లెక్సీ వద్ద పూలమాల వేసి మౌనం పాటించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఎంతో మంది జర్నలిస్టులను తీర్చిదిద్దిన ఘనత రామోజీరావుకే సొంతమని అన్నారు. ఆయన మరణం పత్రిక రంగానికి తీరని లోటు అన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు ఇమంది ఉదయ్‌కుమార్, సీనియర్ ఐజేయు నాయకులు జనుమాల రమేష్, వాహబ్, రాజేందర్, రాజేష్, నాగచారి మాట్లాడారు. ఈ సంతాప సభ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కనుకు వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ యెర్రా ఈశ్వర్, కార్యవర్గ సభ్యులు దశరధ రజువా, సభ్యులు భాస్కర్, పాపారావు, కుమార్, రాజేందర్, వాసు, విష్ణు, కీమత్, శేఖర్, నాగేశ్వరరావు, మహేష్, రాజా, మల్సూర్, శ్రీనివాస్ పాల్గొన్నారు. కమ్మ సేవా సమితి అధ్యక్షుడు బిక్కసాని నాగేశ్వరరావు సంతాపం తెలిపారు.

జలగం సోదరులు సంతాపం

దమ్మపేట: రామోజీరావు అకాల మరణం పట్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి సర్దార్ జలగం వెంగళరావు తనయులు మాజీమంత్రి జలగం ప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ శనివారం సంతాపం తెలిపారు. ఆయన మృతి పత్రిక రంగానికి తీరనిలోటని అన్నారు. పత్రిక అధిపతిగా, ఈటీవి వ్యవస్థాపకులు, సినీనిర్మాతగా, ఆధునిక హంగులతో ఫిలింసిటిని నిర్మించి అన్ని రంగాలలో నూతన ఒరవళ్లు తీసుకువచ్చి ఎందరికో ఆదర్శమయ్యారని అన్నారు. ఈనాడు పత్రికను 1874లో ఆనాడు ముఖ్యమంత్రి హోదాలో తమ తండ్రి జలగం వెంగళరావు ప్రారంభించారని గుర్తుచేసుకున్నారు. దీంతో ఆయన ప్రస్థానం అంచెలంచలుగా రాణించారని అన్నారు. నిరంతర శ్రమ, కార్యదీక్ష, నిబద్ధత గల వ్యక్తి రామోజీరావు అన్నారు. ఈ సందర్భంగా రామోజీ కుమారుడు కిరణ్ కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతిని జలగం బ్రదర్స్ తెలిపారు. ఆయన ప్రవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరారు.

జర్నలిజానికి దిక్సూచి రామోజీరావు

భద్రాచలం: జర్నలిజానికి ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు దిక్సూచి లాంటి వారని వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులు పేర్కొన్నారు. అక్షర యోధుడి అకాల మరణం పాత్రికేయ రంగానికి లోటని అన్నారు. జర్నలిజంలో ఆరంభం నుంచి నేటి వరకు ఉన్నత స్థాయి ప్రమాణాలను కొనసాగిస్తూ ఈనాడు సంస్థల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎందరికో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. ఆయన మృతికి సంతాపం తెలుపుతూ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



ఈనాడు ప్రారంభ కార్యక్రమంలో వెంగళరావుతో రామోజీ

రామోజీరావుకు ఘన నివాళులు..

పాల్వంచటౌన్: అక్షర సైనికుడు రామోజీరావుమృతితో శనివారం పాల్వంచలోని పలు వర్గాలు, పార్టీల ప్రతినిధులు, మీడియా మిత్రులు, కమ్మ సేవా సంఘం నేతలు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, డీసీఎంఎస్ చైర్మన్ ఆధ్వర్యంలో రామోజీరావు చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. కమ్మ సేవా సంఘం కార్యాలయంలో ప్రతినిధులు సామినేని కోటేశ్వరరావు, హరి సత్యనారాయణ, జగన్మోహనరావు, రామారావు, పొందూరి నరసింహారావు, మేదరమెట్ల నారాయణ తదితరులు రామోజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాలులర్పించారు. టీడీపీ రాష్ట్ర నాయకులు కనగాల అనంతరాములు, నలమల వేణు తదితరులు రామోజీ మృతి పట్ల తమ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ ఘన నివాలులర్పించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కిలారు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రామోజీరావు మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ ఘన నివాళులర్పించారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.



నివాళులు అర్పిస్తున్న ఐజేయూ నాయకులు